సాక్షి
వికారాబాద్
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



కలప అక్రమ రవాణా

పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.

8లో▸



పెద్దేముల్: మంబాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

న్యూస్‌రీల్

వాజ్‌పేయికి ఘన నివాళి



రక్తదానం చేస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్, బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో అవసరమైన రక్తం దొరక్క రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడి, 45 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్న వారందరూ రక్తదానానికి అర్హులన్నారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సర్పంచ్ సాధ మల్లారెడ్డి, నాయకులు కొంతం జంగారెడ్డి, ఎస్.భూమిరెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, మాజీ అధ్యక్షులు తాళ్ల అంజయ్య, ఎస్.వెంకట్‌రంగారెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, కోశాధికారి జి.రామన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

28న కొంగరకలాన్‌కు అమిత్‌షా



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో ఈ నెల 28న జరిగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో జిల్లా ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అమిత్‌షా సభకు పార్టీ నుంచి ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై సమావేశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోరెడ్డి నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, అందెల శ్రీరాములు, పాపయ్యగౌడ్, పాండి రాములు, దయానంద్‌గౌడ్, సుధాకర్‌శర్మ, బోసుపల్లి ప్రతాప్, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఆమనగల్లు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన్ రఘునందన్ సూచించారు. ఆమనగల్లు పట్టణం నుంచి తలకొండపల్లి రోడ్డులో వరిధాన్యం ఆరబోసిన రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తాత బాగున్నారా.. ఎన్ని ఎకరాల్లో వరి వేశారు.. ఎంత దిగుబడి వచ్చింది అంటూ రైతులతో ఆప్యాయంగా మాట్లాడారు. రైతులు సాగుచేసిన పంటలు, దిగుబడి వివరాలను తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. వరిధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆయన సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని మోసం చేసే దళారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని డీటీ హెచ్చరించారు.

క్రిస్మస్ శోభ



అనంతగిరి: పాస్టర్లతో కలసి కేక్ కట్ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

జిల్లా వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. మహిళలు, చిన్నారులు ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు. చర్చిలకు పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు తరలివచ్చారు. ఆయా చర్చిలు ఏసు నామస్మరణతో మార్మోగాయి. వికారాబాద్‌లో జరిగిన వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్ మెథడిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

మక్కకు దిక్కేది?



వికారాబాద్ సమీపంలో ఆరబోసిన మక్కలు

- పంట చేతికొచ్చి నెల రోజులు దాటినా జాడలేని కొనుగోలు కేంద్రాలు
- జిల్లాలో 46వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- 87వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,090
- బహిరంగ మార్కెట్‌లో రూ.1,800వరకు చెల్లిస్తున్న వైనం
- క్వింటాలుకు రూ. 300వరకు నష్టపోతున్న రైతులు

వికారాబాద్: సీజన్ ప్రారంభమై నెల కావస్తున్నా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. ఏటా నవంబర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ సంవత్సరం ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 46వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. దిగుబడి చేతికందడంతో విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం కల్లాల్లో ఆరబెట్టారు. కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదు. తాము మాత్రం సమాచారం సేకరించే పనిలో ఉన్నామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితమే మక్కలు రైతుల ఇంటికి చేరాయి. మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటం, తూకాల్లో మోసం వంటి కారణాలతో విక్రయించాలా వద్దా అని దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. అప్పు తెచ్చి పంట సాగు చేసిన రైతులు మాత్రం కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూడకుండా దళారులకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ధర కావడంతో నష్టపోతున్నారు.

ధరలు పతనం

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్, ధారూరు, మర్పల్లి తదితర మార్కెట్లకు ప్రతి వారం 5వేల నుంచి 8వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో వారం వారం ధరలు విపరీతంగా తగ్గిపోతున్నాయి. నెల రోజుల క్రితం క్వింటాలు రూ. 2వేలు అమ్ముడుపోగా ప్రస్తుతం రూ. 1,700 నుంచి 1,800కి వరకు ధర పలుకుతోంది. 2023 – 24 సీజన్‌కు గాను ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,090గా నిర్ణయించారు. ఈ సంవత్సరం జిల్లాలో 46వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా 87వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ఏడు పంట సాగు, దిగుబడి పెరగడంతో ధరలు పడిపోయే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం, మార్కెట్‌లో ధరల ఒడిదుడుకులు కొనసాగుతుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. సీజన్ దాటాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదని అన్నదాతలు అంటున్నారు. కొందరు దళారులు ఏకంగా పొలాల వద్దకే వెళ్లి రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం మక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

‘ప్రజాపాలన’కు ఏర్పాట్లు చేయండి

- రెండు రోజుల్లో పనులు పూర్తి కావాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి రెండు రోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం గూగుల్ మీట్ ద్వారా అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో సభలు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రం, మున్సిపల్ వార్డులు, గ్రామాల్లో ప్రత్యేక అధికారుల బృందాలు పర్యటిస్తాయని చెప్పారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అనంతరం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి రోజూ రెండు దఫాలుగా దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. మహిళల కోసం రెండు కౌంటర్లు, పురుషుల కోసం ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్జీలు ఇచ్చేందుకు వచ్చే వారికి తాగునీటి వసతి, నీడ కోసం టెంట్లు వేయాలని ఆదేశించారు. సమావేశం నిర్వహించడానికి ఒక రోజు ముందు ప్రతి గ్రామం, వార్డులో దండోరా వేయించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించబోయే తేదీలను ముందుగా ప్రజలకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. అన్ని పథకాలకు ఒకటే దరఖాస్తు ఉంటుందని తెలిపారు. ప్రతి టీంలో రెవెన్యూ, గ్రామ పంచాయతీ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాలు, పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవోలు, విద్యుత్, వైద్య శాఖ అధికారులు ఉంటారని తెలిపారు. ప్రతి రోజూ రెండు గ్రామాల చొప్పున కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవసరం మేరకు కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు నర్సింలు ఎంపిక

బొంరాస్‌పేట: జాతీయ స్థాయి త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన నర్సింలు ఎంపికయ్యారు. జనవరి 27నుంచి 29వ తేదీ వరకు జరిగే పోటీల్లో నర్సింలు పాల్గొననున్నారు. సోమవారం క్రీడాకారుడిని గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.



నర్సింలును సన్మానించిన నాయకులు

శ్వాసమీద ధ్యాసే ధ్యానం



కళాకారుల నృత్య ప్రదర్శనలు

ధ్యానంతో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలి

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- ఐదో రోజుకు చేరిన ధ్యాన మహాయాగాలు
- పెద్ద సంఖ్యలో హాజరైన ధ్యానులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కడ్తాల్: శ్వాసమీద ధ్యాసే ధ్యానమని.. ధ్యానం ద్వారా తమ జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలని, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో పత్రీజీ ధ్యాన మహాయాగం సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఉదయం 5 నుంచి 8 గంటలకు సామూహిక ప్రాతఃకాల సంగీత ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా



ధ్యానులను ఉద్దేశించి పరిమళ పత్రి సందేశమిచ్చారు. ధ్యానంలోని రకాలు, విశిష్టతను ధ్యానులకు వివరించారు. సంకల్పానికి ధ్యానం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని, ప్రతి ధ్యాని, ప్రతి పిరమిడ్ మాస్టర్ ధ్యాన జగత్తుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ధ్యానానికి కులమత బేధం లేదు..

మానవాళికి పత్రీజీ చేసిన మహోపకారం శ్వాసమీద ధ్యాస అని ప్రముఖ నటుడు, సినీ గేయ రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ధ్యాన వేడుకలకు హాజరైన ఆయన ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ధ్యానులతో పంచుకున్నారు. 30 ఏళ్ల క్రితం పత్రీజీ నాటిన విత్తనం నేడు ప్రపంచవ్యాప్తంగా వటవృక్షంలా విస్తరించిందని పేర్కొన్నారు. ధ్యానానికి కులమత బేధం లేదన్నారు. అనంతరం ‘నాలోన శివుడు గలడు, నీలోన శివుడు గలడు’.. ‘ఆట గదరా శివ.. ఆటగద కేశవ’ అంటూ ఆధ్యాత్మిక గీతాలతో తన్మయత్వంలో ముంచెత్తారు. కోల్‌కతా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. వరుస సెలవులు రావడంతో పెద్ద సంఖ్యలో ధ్యానులు పిరమిడ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు పరిణిత పత్రి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడాలి

జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి డాక్టర్ భాస్కరయోగి



అయోధ్య అక్షింతలను చేవెళ్ల సర్పంచ్‌కు అందిస్తున్న భాస్కరయోగి

చేవెళ్ల: మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి డాక్టర్ భాస్కరయోగి సూచించారు. దేశ ప్రజల ఎన్నో ఏళ్ల కల అయోధ్యలోని శ్రీరామజన్మ భూమిలో భవ్యమైన రామ మందిరం నిర్మాణం కల నెరవేరుతోందని అన్నారు. మండలకేంద్రంలోని సీహెచ్‌ఆర్ గార్డెన్‌లో సోమవారం శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాలకు అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో జనవరి 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని ప్రతి ఇంటికీ అయోధ్య శ్రీరామక్షేత్ర ట్రస్ట్ అక్షింతలను పంపిణీ చేసిందన్నారు. జనవరి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ వీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ అయిన తరువాత ఈ అక్షింతలు ప్రజలు వారి తలపై వేసుకోవాలని, శుభకార్యాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మనుస్మృతి గ్రంథం సమాజానికి అనవసరం

కేఎన్‌పీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప



ఆందోళన చేస్తున్న కేఎన్‌పీఎస్‌ సంఘం నాయకులు

కొడంగల్‌ రూరల్‌: మనుస్మృతి గ్రంథం బడుగు బలహీన వర్గాలు, నిమ్న వర్గాలను కుల వ్యవస్థ పేరుతో హక్కులు హరిస్తోందని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప ఆరోపించారు. ఈ మేరకు వారు సంఘం సభ్యులతో కలిసి సోమవారం అంబేడ్కర్‌ చౌరస్తాలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుస్మృతిలో నిబంధనలు ఈ సమాజానికి అవసరం లేదన్నారు. హక్కులను కాలరాసే మనుస్మృతి గ్రంథాన్ని డాక్టర్‌ బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ 1927 డిసెంబర్‌ 25న దహనం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఇందనూర్‌ అంజి, కార్యదర్శి మహేశ్‌, సభ్యులు పకీరప్ప, వెంకటయ్య, రుద్రారం పద్మ, బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు అంజిలప్ప, ప్రధాన కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



భక్తుల ప్రత్యేక ప్రార్థనలు

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్‌ నాయక్‌ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగోవింద్‌ తండా పంచాయతీ పరిధిదలోని గురులోకమసంద్‌ ప్రభు ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌ నాయక్‌, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు వెంకటయ్య, చెల్లాపూర్‌ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి



గాయపడిన వెంకటయ్య

మాడ్గుల: ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మాడ్గుల మండలం ఇర్విన్‌ గ్రామానికి చెందిన క్రాంతికుమార్‌ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా రెండేళ్లు పని చేసి ఇటీవల మేడ్చల్‌ జిల్లాకు బదిలీ అయ్యారు. కంప్యూటర్‌ ఆపరేటర్‌ క్రాంతికుమార్‌ రంగారెడ్డి జిల్లాలో పనిచేసినప్పుడు ఉన్నతాధికారులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు సంపాదించాడని గ్రామానికి చెందిన వెంకటయ్య ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన వెంకటయ్యపై క్రాంతికుమార్‌ దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు మాడ్గుల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఇరువురు బంధువులని పోలీసులు వివరించారు. వెంకటయ్య తనపై దాడి చేశారని ఆపరేటర్‌ క్రాంతికుమార్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన

షాబాద్‌షరీఫ్‌: మామిడిపల్లిలోని బాలమణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం శబరిమల సన్నిధాన సహాయ అర్చకులు బ్రహ్మశ్రీ ఉన్ని కృష్ణన్‌ నంబూద్రీ, యు.ఆర్‌.ప్రసాద్‌ గురుస్వామి, ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఉ.6 గంటలకు గణపతి హోమం నిర్వహించారు. 10 గంటలకు లక్ష పుష్పార్చన చేశారు. సాయంత్రం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా

అడవుల రక్షణకు ప్రభుత్వాలు పనిచేస్తుంటే.. అక్రమార్కులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా కలప తరలిస్తున్నారు. అధికారుల కంట పడకుండా ఈ చీకటి వ్యాపారం జోరుగా సాగుతోంది.

పగలు నరకడం... రాత్రికి తరలించడం

- ఇటుక బట్టీలు, సుద్ద పరిశ్రమలకు తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



ఇటుక బట్టీల వద్ద కలప

పెద్దేముల్‌: పర్యావరణ పరిరక్షించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల అలసత్వంతో ఈ అక్రమదందా జోరుగా సాగుతోంది. కలపకు ఇటుక బట్టీలు, సుద్ద పరిశ్రమల్లో మంచి డిమాండ్‌ ఉండడంతో అక్రమార్కులు చెట్లను నరికి చీకట్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది దళారులు పంట పొలాల్లో అనుమతులు లేకుండా చెట్లను నరికి రాత్రిళ్లు తాండూరు, వికారాబాద్‌. జహీరాబాద్‌ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం హరితహారం పేరిట ఖర్చు పెట్టిన కోట్ల రుపాయల వృథా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

ఒక్క చెట్టుకు అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాతాన్ని రెట్టింపు చేసే ఉద్దేశంతో లక్షల రూపాయాలు వెచ్చించి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ప్రతీ ఏడు మొక్కలు నాటుతున్నా 50శాతం మొక్కలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా 40శాతం మేర మొక్కలు నాటితే 30శాతం వరకు చెట్లను నరికేస్తున్నారు. మండల పరిధిలోని మంబాపూర్‌, కందనెల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్ల, నాగులపల్లి, పెద్దేముల్‌ మారేపల్లి ప్రాంతాలల్లో ఎక్కువగా చెట్లను నరికేస్తున్నారు. మండలంలోని మారేపల్లి, కోటపల్లి మండల ఓగ్లాపూర్‌ గ్రామ శివారుల్లో ఉన్న సుద్ద పరిశ్రమలకు పెద్ద ఎత్తున కలప తరలిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నారు. అధికారులు సైతం పత్రికల్లో వచ్చినప్పుడు తప్ప మిగిలిన సమయంలో పట్టించుకోవడం లేదనే అపవాదు మూటకట్టుకుంటున్నారు. కొంత మంది అనుమతులు తీసుకుంటున్నా.. ఒక్క చెట్టుకు అనుమతి తీసుకుని ఎక్కువ మొత్తంలో చెట్లను నరికేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అధికారుల అనుమతులున్నాయంటూ సమాధానం ఇస్తున్నారని సమాచారం. అక్రమ కలప ట్రాక్టర్‌లు అధికారులకు చిక్కితే నామమాత్రంగా రూ.500లు జరిమానా విధిస్తున్నారని సమాచారం. మండలంలో రోజుకు సుమారు ఐదు నుంచి పది ట్రాక్టర్ల వరకు కలపను తరలిస్తున్నట్లు సమాచారం.

వాల్టాకు తూట్లు

వాల్టా చట్టం ప్రకారం కలప, ఇసుక తరలింపును అధికారులు అడ్డుకోవలసి ఉంటుంది. మండల స్థాయిలో ఏ అధికారి పట్టించుకోవటం లేదు. చెట్ల నరికి వేత, కలప తరలింపు నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నా యి. రైతులు పట్టా భూములల్లో చెట్లను నరికి వే యాలనుకుంటే రెవెన్యూ కార్యాలయంలో దర ఖాస్తు చేసుకోవాలి. స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్‌ అనుమతి ఇస్తేనే రైతులు కొట్టుకునేందుకు అ వకాశం ఉంటుందన్నారు. అధికారులు సైతం దళారులతో చేయి కలిపాలనే ప్రచారం సాగుతోంది.

అవగాహన కల్పించాలి



రైతులకు సరైన అవగాహణ లేకపోవడంతో దళారులు, వ్యాపారుల మాటలు విని చెట్లను నరికి వేస్తున్నారు. రైతులకు చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. అప్పుడు మాత్రమే నాటిన మొక్కను సంరక్షించిన వారమవుతాం.

– రాంరెడ్డి, రైతు, గిల్యాపూర్‌

ప్రతీ మొక్కను సంరక్షించాలి



కలపకు మంచి డిమాండ్‌ ఉండటంతో దళారులు, వ్యాపారస్థులు విచ్చలవిడిగా చెట్లను నరికేస్తున్నారు. అధికారులు వాల్టా చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడండి. అప్పుడే న్యాయం జరుగుతుంది. నాటిన ప్రతీ మొక్క బతికేలా చుడాలి.

– గౌస్‌ పాషా, అడ్కిచెర్ల

సమాచారం ఇవ్వండి



చెట్లను నరికి వేసేందుకు ఎవరికి అనుమతి ఇవ్వటం లేదు. కానది చెట్లను నరికితే చట్ట ప్రకారం కేసులు పెడుతాం. అవసరం అయితే కలప తరలిస్తున్న వాహనాలను సీజ్‌ చేస్తాం. ఎవరైనా గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి.

– కిషన్‌, తహసీల్దార్‌ పెద్దేముల్‌

కుక్కను తప్పించబోయి..


స్కూటీ పై నుంచి పడి యువకుడి మృతి

షాబాద్‌షరీఫ్‌: స్కూటీకి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన షాబాద్‌షరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్‌.వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన కర్నాటి దీపక్‌ కుమార్‌ నేత(29) మామిడిపల్లిలోని అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో స్కూటీపై ఉప్పుగూడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్‌–అర్రూస్‌ పాఠశాల వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో సడెన్‌గా బ్రేక్‌ వేయడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి బావమరిది వంశి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

మంచాల: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చీదేడ్‌ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సన్నాయిల రమేశ్‌(35) కుటుంబ కలహాలతో మనస్తాపం చెందాడు. దీంతో ఆయన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. కేసు దర్యాప్తులో ఉంది.

వరుస సెలవులు.. ఓటీపీ కొర్రీలు



కాటన్‌ మిల్లుకు పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు

ఆందోళనలో పత్తి రైతులు

మోమిన్‌పేట: మార్కెట్‌కు వరుస సెలవులవ్వడంతో పత్తి రైతు ఆందోళనకు గురువుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి డిమాండ్‌ తగ్గడంతో దళారులు మద్దతు ధరకు రూ.500 తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు సీసీఐకే పత్తి అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. స్థానిక అయ్యప్ప కాటన్‌ మిల్‌లో ప్రభుత్వం రూ.7020 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది. సీసీఐలోనూ ఒక్కోరైతు వద్ద ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వానాకాలంలోఎ నమోదైన పంటలకు అనుగుణంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతుల ఆధార్‌ నంబరును ఎంట్రీ చేస్తే ఓటీపీ వస్తుంది. అలా వచ్చిన రైతుల నుంచే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. కావున రైతులు ఆధార్‌, బ్యాంకు పాసు పుస్తకం నంబరు, పట్టాదారు పాసు పుస్తకం నంబరు తప్పని సరిగా ఫోన్‌ నంబరుకు అనుసంధానమై ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో పంటల నమోదు సమయంలో పత్తిని ఎన్ని ఎకరాలలో సాగు చేశామో ఏఈఓల వద్ద నమోదు చేయించుకొంటేనే ప్రస్తుతం అమ్ముకొనేందుకు వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేసుకోకుంటే ఉన్నాతాధికారులు ఆర్‌ఐ, ఏఈఓ వద్ద రాయించుకొచ్చినా సరిపోతుందని సూచించినా రైతులకు మాత్రం అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓటీపీ ఉండటం వలన ముందుగా నమోదు చేసుకొంటేనే అమ్ముకొనేందుకు అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఎటువంటి కొర్రీలు లేకుండా సీసీఐ వారు పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొడంగల్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

చార్మినార్‌ జోన్‌లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలి

- కొడంగల్‌ జేఏసీ నాయకుల వినతి



అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు



కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కొడంగల్‌ రూరల్‌: కొడంగల్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ చార్మినార్‌ జోన్‌లోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కొడంగల్‌ జేఏసీ నాయకులు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడంగల్‌ను మహబూబ్‌నగర్‌ జిల్లాలోకి మార్చుతున్నారని జోరుగా చర్చ జరుగుతోందన్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లాలో కొడంగల్‌ను చేర్చడంతో జోగులాంబ జోన్‌లో ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. హైదరాబాద్‌, రంగారెడ్డి ప్రాంతాలలో చదివే విద్యార్థులకు ఐటీ రంగంలో కొనసాగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొడంగల్‌ నుంచి గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఇక్కడి ప్రాంత వాసులకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ములుగు, సిరిసిల్ల, గద్వాల వంటి నియోజకవర్గాలను జిల్లాలుగా చేశారని, జనాభా ప్రాతిపదికన ఆయా జిల్లాల కంటే కొడంగల్‌ నియోజవర్గ జనాభా ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో కొడంగల్‌ను జిల్లాగా ఏర్పాటుచేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కొడంగల్‌ జేఏసీ నాయకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్‌, ఉపాధ్యాయుడు బసప్ప, మడిగె శ్రీనివాస్‌, బుస్స చంద్రయ్య, రమేష్‌బాబు, భీమరాజ్‌, దస్తప్ప, గాయకుడు బలరాం, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జికి నిరుద్యోగుల వినతి

కొడంగల్‌ రూరల్‌: నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని పలువురు నిరుద్యోగులు, నాయకులు సోమవారం ముఖ్యమంత్రి సోదరుడు, కాంగ్రెస్‌ కొడంగల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుములు తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందించారు. గతంలో గుల్బర్గా జిల్లాలో కొడంగల్‌ ఉండేదని, అనంతరం మహబూబ్‌నగర్‌ జిల్లాలో కలిపారని అన్నారు. తర్వాత కొడంగల్‌ నియోజకవర్గంలోని కొడంగల్‌, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌ మండలాలను వికారాబాద్‌ జిల్లాలో, కోస్గి, మద్దూరు మండలాలను నారాయణపేట జిల్లాలో కలుపుతూ కొడంగల్‌ నియోజకవర్గాన్ని దుర్భరంగా మార్చారని వినతిపత్రంలో ప్రస్తావించారు. కొడంగల్‌ వెనకబడిన ప్రాంతమని కొడంగల్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేస్తూ అభివృద్ధికి కషిచేయాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి తదితర విషయాలలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన తిరుపతిరెడ్డి ముఖ్యమంత్రికి విషయం విన్నవిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దశరథ్‌, వెంకటయ్య, నర్సింలు, రామాంజనేయులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన' పక్కగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్‌ గౌతం పొట్రు

- ఈ మేరకు ప్రణాళికలు రూపొందించండి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దు
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతం పొట్రు
- వెంటనే జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతి పెంచేందుకు చేపట్టిన బృహత్తర ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని కొత్త కలెక్టర్‌ గౌతం పొట్రు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా ఉన్న భారతిహోళికేరిని ప్రభుత్వం ఆదివారం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గౌతం పొట్రు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్‌ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీత ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో ప్రజాపాలన కార్యక్రమం అమలుకు రూపొందించాల్సిన ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్షించారు.

వందకు ఒక కౌంటర్‌

ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని సూచించారు. ముందు వెయ్యిలోపు జనాభాఉన్న గ్రామాలనుతీసుకోవాలని,ప్రతికుటుంబానికి ఒక దరఖాస్తు అందేలా చేయాలన్నారు. ఇలా రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి పంచాయతీలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎంపీఓలు, ఎంఈఓలు డిప్యూటీ తహసీల్దార్లు బృందాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచివచ్చే అర్జీలను స్వీకరించేందుకు ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ చొప్పున ఐదు కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. 28, 29 తేదీల్లో చిన్న పంచాయతీలు, 30వ తేదీ నుంచి పెద్ద గ్రామ పంచాయతీలను ప్రణాళికలోకి తీసుకోవాలన్నారు.

దరఖాస్తులను ప్రజలకు అందజేయాలి

దరఖాస్తులను ప్రభుత్వమే ప్రజలకు అందజేస్తుందని చెప్పారు. ముందు రోజే అందజేయడం ద్వారా వాటిలో వివరాలను నింపడం సులభమవుతుందని చెప్పారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలకు అర్హులైన వాళ్లు అర్జీలు ఇవ్వాలని సూచించారు. ప్రజా పాలనపై ప్రతి గ్రామంలో, మున్సిపల్‌ వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



యాదయ్య మృతదేహం

షాబాద్‌: అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మాచన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బైండ్ల యాదయ్య(35) శనివారం రాత్రి అతిగా మద్యం సేవించి పడిపోయాడు. ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల వెతికారు. మద్యం సేవించి పడిపోయిన ఆయన్ను చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. భార్య మనీలా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో..



రమేష్‌ మృతదేహం

అడవి కాకరకాయలు తీసుకువచ్చేందుకు వెళ్లిన వ్యక్తి ఫిట్స్‌తో మృతి చెందాడు. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన పిట్టల రమేశ్‌(40) శనివారం కాకరకాయలు తీసుకువస్తానని చెప్పి వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో వెతుకుతుండగా కాల్వలో పడిపోయి కనిపించాడు. తరుచుగా ఫిట్స్‌ వస్తుంటాయని దీంతో కాల్వలో పడిపోయి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులకు పోలీసులకు తెలిపారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన పొగమంచు

- స్కూటీని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- ఘటనా స్థలిలోనే అయ్యప్ప మాలధారుడి మృతి
- సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు



సురేందర్‌ (ఫైల్‌)

నందిగామ: రోజుమాదిరిగానే స్నానికి ఇంటికి వెళ్తున్న అయ్యప్ప మాలధారణ స్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చాకలిగుట్ట తండా సమీపంలోని జేపీ దర్గారోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల ప్రకారం.. చాకలిగుట్టతండా పంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాకు చెందిన జటావత్‌ సురేందర్‌ నాయక్‌(40) అయ్యప్ప మాల వేసుకున్నాడు. గ్రామ సమీపంలోని ఆలయ ఆవరణలో మాలధారణ స్వాములతో కలిసి ఉంటున్నాడు. రోజు మాదిరిగానే తన స్కూటీపై ఇంటికి స్నానికి వెళ్తుండగా దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనం కనపడలేదు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొటడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. విష యం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, తండా వాసులు, మాల ధారణ స్వాములు అక్కడకి చే రుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. మృతుడి భార్య సుమిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐగోపాలకృష్ణ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



కొందుర్గులో మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- మృతదేహంతో ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

కొందుర్గు: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ దుర్ఘటన ఆదివారం శ్రీరంగాపూర్‌ సబ్‌స్టేషన్‌ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌, క్రాంతికుమార్‌ బైక్‌పై షాద్‌నగర్‌ నుంచి చౌదరిగూడకు వెళ్తున్నారు. శ్రీరంగాపూర్‌ సబ్‌స్టేషన్‌ వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరిబైక్‌ను ఢీకొట్టింది. దీంతో చంద్రశేఖర్‌, క్రాంతికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న చంద్రశేఖర్‌ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పూజిత, మూడు నెలల చిన్నారి సంతానం. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆందోళన చేపట్టారు. అరగంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి, షాద్‌నగర్‌ రూరల్‌ సీఐ లక్ష్మీరెడ్డి అక్కడకి చేరుకున్నారు. కారు కొత్తూరుకు చెందిన నర్సింలుకు చెందినదిగా గుర్తించామని విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కోవిడ్‌ భయం.. జోష్‌ మాయం

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా కోవిడ్‌ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. నగరంలోనూ ఆ ప్రభావం కనిపిస్తోంది. ఓ వైపు నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమవుతున్న వేళ.. మరోవైపు తరుముకొస్తున్న మహమ్మారి అటు నగర వాసులతో పాటు న్యూ ఇయర్‌ ఈవెంట్ల నిర్వాహకులనూ ఆందోళనకు గురి చేస్తోంది.

వేడుకలు.. వ్యాప్తికి వేదికలు..

న్యూ ఇయర్‌ వేడుకలు ఏటా అట్టహాసంగా జరుగుతాయి. గ్రేటర్‌ పరిధిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో కలిపి అధికారికంగా అనుమతి పొందినవే ఏటా దాదాపు ఏడువేల ఈవెంట్లుంటాయి. పెద్దగా వెంటిలేషన్‌ లేని ఎయిర్‌ కండిషన్డ్‌ వాతావరణంలో జరిగే కార్యక్రమాలు కావడంతో సాధారణ ఫ్లూ నుంచి కోవిడ్‌ వంటి వ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ.

అన్ని నగరాల్లోనూ అలర్ట్‌

దేశవ్యాప్తంగా ప్రస్తుతం కోవిడ్‌ యాక్టివ్‌ కేసుల సంఖ్య వేలల్లోకి చేరింది. దీంతో కేంద్రం పలు రాష్ట్ర ప్రభుత్వాల్ని అప్రమత్తం చేసింది. అందులో కేరళ, కర్ణాటకతో పాటు తెలంగాణ కూడా ఉంది. కొచ్చి, బెంగళూర్‌, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో ఇప్పటికే న్యూ ఇయర్‌ వేడుకలపై కోవిడ్‌ ప్రభావం పడింది. అక్కడి ప్రభుత్వాలు వేడుకలపై పలు రకాల ఆంక్షల్ని విధించాయి. దీంతో మన నగరంలోనూ ప్రభుత్వం, అధికారులు న్యూ ఇయర్‌ వేడుకల కోసం ప్రత్యేకంగా కోవిడ్‌ ప్రొటోకాల్‌ను సిద్ధం చేసే అవకాశం కనిపిస్తోంది. నగరంలో వేగంగా కాకపోయినా స్థిరంగా కోవిడ్‌ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది.